సాక్షి అనంతపురం

సోమవారం । 12 । ఫిబ్రవరి । 2024



సందడిగా తిరునాల

గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాలలో భాగంగా మొదటి ఆదివారం ఆలయంలో సందడి నెలకొంది.

8లో



టమాట కిలో రూ.16

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

36.4°/ 16.7°

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగింది.ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

15 నుంచి 'జగనన్న పాలవెల్లువ'

అనంతపురం అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా ఈనెల 15న 'జగనన్న పాలవెల్లువ' కార్యక్రమం ప్రారంభించనున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం, ఆత్మకూరు, రాప్తాడు మండలాల పరిధిలో తొలివిడతగా 'అమూల్' ద్వారా పాలు సేకరిస్తారన్నారు. 55 ఆర్బీకేల పరిధిలో 98 ఏఎంసీలు, రూరల్ మండలం రాచానపల్లి, బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు వద్ద 2 బీఎంసీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఏఎంసీల పరిధిలో మహిళా సంఘాలు, పాల ఉత్పత్తిదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ డెయిరీల కన్నా లీటర్‌పై కనీసం రూ.5కు పైగా గిట్టుబాటు అవుతుందని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏఎంసీల పరిధిలో పశుశాఖ, డీఆర్‌డీఏ, సహకారశాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

పలు రైళ్ల పునరుద్ధరణ



అనంతపురం సిటీ: గతంలో వివిధ కారణాలతో రద్దు చేసిన పలు రైళ్లను పునరుద్ధరించినట్లు అనంతపురం రైల్వేస్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్‌కుమార్ ఆదివారం తెలిపారు. కుర్లా–కోయంబత్తూరు–కుర్లా మధ్య తిరిగే కుర్లా ఎక్స్‌ప్రెస్ రైళ్లు (నంబర్: 1013/1014) పునరుద్ధరించినట్లు వివరించారు. యశ్వంత్‌పుర–సికింద్రాబాద్–యశ్వంత్‌పుర మధ్య నడిచే గరీబ్‌రథ్ రైళ్లు (నంబర్: 12736/12735) కూడా యథాతథంగా రాకపోకలు సాగిస్తాయన్నారు. మచిలీపట్నం–యశ్వంత్‌పుర–మచిలీపట్నం మధ్య తిరిగే కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ను పునఃప్రారంభించినట్లు తెలిపారు. హౌరా–ప్రశాంతినిలయం–హౌరా మధ్య నడిచే రైళ్లు (నంబర్: 22831/22832) కూడా పునరుద్ధరించారు. గుంతకల్లు రైల్వే జంక్షన్ నుంచి శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం వరకు రాకపోకలు సాగించే డెమో ప్యాసింజర్ రైళ్లు (నంబర్: 22831/22832) ఆదివారం నుంచి రాకపోకలు సాగించనున్నట్లు మేనేజర్ తెలిపారు. ప్రయాణికులు, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్



అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా సాగాయి. మొత్తం 6,137 మంది జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు గాను 5,917 మంది హాజరయ్యారు. 220 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 3,755 మందికి గాను 3,585 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 2,382 మందికి గాను 2,332 మంది హాజరయ్యారు. మొత్తం 55 కేంద్రాల్లో పరీక్షలు జరగ్గా, ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ వెంకటరమణనాయక్ 8 కేంద్రాలు, డీఈసీ సభ్యులు 6, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 20 కేంద్రాలను పరిశీలించారు.

సుర్రుమంటున్న సూరీడు



అనంతపురం అగ్రికల్చర్: వేసవి ప్రారంభం కాక మునుపే సూరీడు సుర్రుమంటున్నాడు. వారం రోజులుగా మధ్యాహ్నం వేసవి సెగ కనిపిస్తోంది. ఈ నెల రెండో వారం నుంచి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. అంతకు మునుపు పగలు 30 నుంచి 33 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. 4 రోజులుగా చాలా మండలాల్లో 35 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. తాడిపత్రి, యాడికి, శింగనమల, పామిడి, పుట్లూరు మండలాల్లో 36 నుంచి 38 డిగ్రీలకు చేరుకుంటున్న పరిస్థితి. అయితే శెట్టూరు, కుందుర్పి, కంబదూరు, గుమ్మగట్ట, రాయదుర్గం, కూడేరు తదితర మండలాల్లో వేకువజామున 15 నుంచి 17 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మిగతా మండలాల్లో 18 నుంచి 20 డిగ్రీలకు ఎగబాకాయి. ఈ క్రమంలో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. శ్రీ సత్యసాయి జిల్లాలో కూడా ఇలాంటి వాతావరణమే కనిపిస్తోంది.

చిన్న పరిశ్రమలకు పెద్ద తోడ్పాటు

కావాల్సినంత చేయూత అందుతోంది. ఈజీగా అనుమతులు లభిస్తున్నాయి. మౌలిక వసతులూ అందుబాటులో ఉన్నాయి. ఉన్న చోటునే చిన్నస్థాయి పరిశ్రమ ఏర్పాటుకు ఇంతకంటే ఇంకేం కావాలి! అందుకే ఔత్సాహికులు ముందుకొస్తున్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. తాము ఉపాధి పొందడమే కాకుండా మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలతో జిల్లాలో పెద్దసంఖ్యలో ఎంఎస్ఎంఈలు వెలుస్తున్నాయి.

- ప్రభుత్వ తోడ్పాటుతో ముందుకొస్తున్న ఔత్సాహికులు
- ఈ ఏడాదిలో 3,600కు పైగా పరిశ్రమల ఏర్పాటు
- రూ.216 కోట్లకు పైగా పెట్టుబడులు
- 14 వేల మందికి పైగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు



అనంతపురం సమీపంలోని పారిశ్రామికవాడలో ఏర్పాటైన పాలిమర్ పరిశ్రమ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రభుత్వ ప్రోత్సాహం, అధికారుల సహకారం వెరసి జిల్లాలో ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు)లు పెద్ద సంఖ్యలో ఏర్పాటవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలోనే 3,714 పరిశ్రమలు ప్రారంభమయ్యాయి. రూ. 216.27 కోట్ల పెట్టుబడులు పెట్టారు. పరిశ్రమల ద్వారా 14,174 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. గత నాలుగేళ్లతో పోల్చితే ఈ సంవత్సరం భారీగా నమోదైనట్టు వెల్లడైంది. వ్యవసాయాధారిత పరిశ్రమలు, ఆయిల్ మిల్లులు, గృహ వినియోగ వస్తువుల పరిశ్రమలు వంటివి భారీ స్థాయిలో ఉద్యోగావకాశాలు కల్పించాయి.

భారీగా తగ్గిన వలసలు..

గతంలో అనంతపురం జిల్లా అంటే వలసలకు కేంద్ర బిందువుగా ఉండేది. ఇప్పుడా పరిస్థితులు కనుమరుగయ్యాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వరుసగా నాలుగేళ్లు పుష్కలంగా వర్షాలు కురిశాయి. దీంతో వ్యవసాయ పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోయింది. కూలీలకు ఉన్న ఊరిలోనే ఉపాధి లభించింది. అయితే, గత ఏడాది వర్షాభావం నెలకొన్నా.. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగులకు ఊరట లభించింది. 2019 కంటే ముందుతో పోలిస్తే, ప్రస్తుతం పూర్తి భిన్నమైన పరిస్థితులు నెలకొనడం గమనార్హం. వాస్తవానికి ఈ ఆర్థిక సంవత్సరంలో 14,686 ఎంఎస్ఎంఈలు 'ఉద్యం' పోర్టల్‌లో నమోదు చేసుకున్నాయి. అందులో ఇప్పటివరకూ 3,714 ఏర్పాటయ్యాయి. త్వరలో మరో 2 వేల పరిశ్రమలు ప్రారంభం కానున్నాయి. సీఎం జగన్ సర్కారు తీసుకొచ్చిన సింగిల్ పోర్టల్ విధానం, అందిస్తున్న రాయితీ ప్రోత్సాహకాలతో పరిశ్రమలు స్థాపించేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు.

2023-24లో ఎంఎస్ఎంఈల ఏర్పాటు ఇలా

నెల	ఎంఎస్ ఎంఈలు	పెట్టుబడులు	ఉపాధి పొందిన వారు
2023 ఏప్రిల్	217	రూ.17.16 కోట్లు	664
2023 మే	237	రూ.15.37 కోట్లు	965
2023 జూన్	322	రూ.17.12 కోట్లు	1,016
2023 జూలై	355	రూ.22.50 కోట్లు	1,370
2023 ఆగస్ట్	444	రూ.25.17 కోట్లు	1,462
2023 సెప్టెంబర్	399	రూ.17.31 కోట్లు	2,672
2023 అక్టోబర్	366	రూ.17.57 కోట్లు	1,632
2023 నవంబర్	420	రూ.29.41 కోట్లు	1,649
2023 డిసెంబర్	477	రూ.27.29 కోట్లు	1,421
2024 జనవరి	477	రూ.27.37 కోట్లు	1,323

పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం



జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే ఔత్సాహికులకు ప్రోత్సాహం అందిస్తున్నాం. పారిశ్రామికవాడల్లో కేటాయించిన స్థలాల్లో పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం తీసుకొచ్చిన సింగిల్‌విండో విధానంతో సులువుగా అనుమతులు లభిస్తున్నాయి. దీంతో భారీ సంఖ్యలో ఎంఎస్ఎంఈలు ఏర్పాటవుతున్నాయి. నిరుద్యోగులకు ఉపాధి చూపుతున్నాయి.

– గౌతమి, కలెక్టర్

లక్ష్మీనృసింహుని సేవలో జస్టిస్ శ్యామ్‌సుందర్



లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్‌సుందర్

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యామ్‌సుందర్ దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఈఓ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు ద్వారకనాథచార్యులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎంపీ రంగయ్య..

అనంతపురం పార్లమెంట్ సభ్యులు, కళ్యాణదుర్గం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య ఆదివారం పెన్నహోబిళం లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ విజయ్‌కుమార్ ఆయనను ఘనంగా సత్కరించి స్వామి చిత్రపటాన్ని బహూకరించారు.



ఎంపీ తలారి రంగయ్యకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ ఈఓ

చరిత్రలో నిలిచేలా 'సిద్ధం'

- ఇప్పటికే ప్రతిపక్షాల వెన్నులో వణుకు
- రాయలసీమలో ప్రభంజనం సృష్టిస్తాం
- త్వరలో పొత్తుల పార్టీల పరారు
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: రాప్తాడులోని ఆటోనగర్ వద్ద ఈ నెల 18న నిర్వహించనున్న 'సిద్ధం' సభ చరిత్రలో నిలవనుందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే భీమిలి, దెందులూరులో నిర్వహించిన 'సిద్ధం' సభలకు వచ్చిన స్పందన చూసి ప్రతిపక్షాల వెన్నులో వణుకు మొదలైందన్నారు. ఆ రెండు సభల కంటే మిన్నగా రాప్తాడులో సీఎం సభ జరగనుందన్నారు. రాయలసీమ వ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు 10 లక్షల మందికి పైగా తరలిరానున్నారన్నారు. టీడీపీ హయాంలో హత్యా రాజకీయాలకు కేరాఫ్ అడ్రెస్‌గా ఉన్న రాయలసీమను అభివృద్ధికి అడ్డాగా మార్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ఆయన తీసుకున్న చర్యలతో నేడు రాయలసీమ పవర్ జంక్షన్‌గా, వాటర్ బ్యాంక్‌గా, ఇండస్ట్రీల హబ్‌గా మారిందని కొనియాడారు. 124 సార్లు కంప్యూటర్ బటన్ నొక్కి నిరుపేదలకు చేయూతనందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. జగనన్న ఏర్పాటు చేసిన వలంటీర్లు సంక్షేమ ఫలాలను ఇళ్లముంగిటకే చేర్చారన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో 'ఫ్యాను గుర్తు'కు ఓటేసి సంక్షేమ సారథికి అండగా నిలవాలని ఆయన కోరారు.

త్వరలో పొత్తుల పార్టీల కనుమరుగు..

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో 'సిద్ధం' సభకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తెలిపారు. సభలో సీఎం వైఎస్ జగన్ ప్రసంగం కోసం ప్రజలు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని చెప్పారు. 'సిద్ధం సభకు నేను వెళుతున్నా.. మీరు వస్తున్నారా?' అని గ్రామాల్లో ప్రతి కార్యకర్త పిలుపునిస్తున్నారన్నారు. పింఛన్ తీసుకుంటున్న అవ్వా తాతలు తామే జగన్ మోహన్‌రెడ్డి సైనికులమంటున్నారు. 'ఆసరా', 'చేయూత' పథకాలతో లబ్ధి పొందిన అక్కచెల్లెమ్మలు మళ్లీ జగనన్నకే మా మద్దతు అంటున్నారని గుర్తు చేశారు. 'రైతు భరోసా', 'ఉచిత విద్యుత్' పథకాలతో లబ్ధి పొందిన రైతన్నలు వైఎస్సార్ సీపీ జెండా పట్టుకుని రాప్తాడుకు కదలి రానున్నారన్నారు. రాప్తాడు సభలో పార్టీ శ్రేణులు చేసే జయజయధ్వానాలు రాష్ట్రవ్యాప్తంగా మార్మోగనున్నాయన్నారు. ఈ సభ తర్వాత పొత్తుల పార్టీలు పరారవడం ఖాయమన్నారు. రాయలసీమలో మళ్లీ తమ పార్టీ ప్రభంజనం సృష్టించనుందన్నారు. ఈ సారి అన్ని స్థానాలనూ కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కనీసం పంచాయతీ ఎన్నికల్లో కూడా గెలవని నారా లోకేష్ మాటలు పట్టించుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ చంద్ర, ఉప్పరపల్లి శ్రీనివాసులు, రాప్తాడు మండల పార్టీ కన్వీనర్ జూటూరు శేఖర్, ధనుంజయ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌లో అధునాతన శస్త్రచికిత్సలు



వైద్య సదస్సుకు హాజరైన ప్రముఖ న్యూరో సర్జన్లు, ఆర్థో పెడీషియన్లు, చిత్రంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

- ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

అనంతపురం మెడికల్: జిల్లా కేంద్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అధునాతన పరికరాలతో శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. ఆదివారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో న్యూరో సర్జరీ, ఆర్థోపెడిక్స్, బెంగళూరు ఎస్టర్ సీఎంఐ ఆస్పత్రి సహకారంతో 'మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీ (చిన్నగాటుతో ట్యూబ్ పంపి శస్త్రచికిత్స)' అనే అంశంపై నిరంతర వైద్య సదస్సు (సీఎంఈ) జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక నుంచి 150 మంది హాజరయ్యారు.ప్రిన్సిపాల్,సూపరింటెండెంట్లతో పాటు ప్రముఖ సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ డబ్ల్యూ సీతారాం, సూపర్ స్పెషాలిటీ న్యూరో విభాగాధిపతి డాక్టర్ భాస్కర్, స్పైన్ సర్జరీల్లో నూతన ఆవిష్కరణలను తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ మాట్లాడుతూ వైద్య కళాశాల ఏర్పాటైన 24 ఏళ్లలో తొలిసారిగా న్యూరో సీఎంఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇలాంటి సదస్సుల ద్వారా ఆలోచనలు పంచుకునే ఆస్కారం ఉంటుందన్నారు. ప్రముఖ సీనియర్ న్యూరో సర్జన్ డబ్ల్యూ సీతారాం మాట్లాడుతూ అధునాతన సర్జరీలు సూపర్ స్పెషాలిటీలో నిర్వహించడం అభినందనీయమన్నారు. న్యూరో విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీలను ప్రైవేటుగా చేయించుకోవాలంటే రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఖర్చు అవుతుందని, అలాంటిది సూపర్ స్పెషాలిటీలో ఉచితంగా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకూ 470 మేజర్, 450 మైనర్ సర్జరీలను విజయవంతంగా చేశామన్నారు. 20,000 మందికి ఓపీ సేవలు అందించామన్నారు. ఆస్టర్ సీఎంఐ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ ఉమేష్ శ్రీకాంత వర్క్‌షాప్ క్లినికల్ ముఖ్యాంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం నగరంలోని ఓ ప్రముఖ హోటల్‌లో కార్యక్రమం ఏర్పాటు చేసి హాజరైన ప్రతినిధులను సన్మానించారు. సదస్సులో పరిశీలకులుగా రాష్ట్ర వైద్య మండలి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ ఎస్‌వీకే ప్రసాదరెడ్డి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ సుభాష్ చంద్రబోస్, న్యూరో సర్జన్ డాక్టర్ రవితేజ, ఆర్థో హెచ్ఓడీ ఆత్మారాం, వైద్యులు డాక్టర్ సతీష్, డాక్టర్ శాంతిస్వరూప్, డాక్టర్ గౌస్, ఆస్టర్ సీఎంఐ హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌జీఎస్ లక్ష్మణన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

- ఐదు రోజుల తర్వాత వెలుగులోకి



దీప (ఫైల్)

చిక్కబళ్లాపురం: కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లాపురంలోని చామరాజపేట సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ సమీపాన ఓ ఇంట్లో మహిళ హత్యకు గురైంది. ఐదు రోజుల తర్వాత ఈ ఘటన వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. కాన్వెంట్ సమీపాన గల ఇంట్లో దీప (40), మల్లికార్జున్ అలియాస్ దివాకర్ జంట గత జనవరి నెలలో అద్దెకు దిగారు. తాము భార్యాభర్తలమని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీసత్యసాయి జిల్లా కదిరి ప్రాంతానికి చెందిన వారిగా ఇంటి యజమాని వద్ద చెప్పారు. దీప ఇంటి పట్టున ఉండగా.. మల్లికార్జున ఒక షాపులో పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఏమైందో తెలియదు గానీ ఈ నెల ఏడో తేదీ నుంచి ఇంటి తలుపులు తీయలేదు. ఆదివారం ఉదయం ఇంట్లోంచి దుర్వాసన వస్తుండటంతో ఇంటి యజమాని, స్థానికులు కిటికీలో నుంచి చూడగా దీప అచేతనావస్థలో కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి లోనికెళ్లి చూడగా దీప గొంతును కత్తితో కోసినట్లుగా గుర్తించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్పీ నాగేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీప భర్తగా చెప్పుకునే మల్లికార్జున కనిపించడం లేదు. అతనే ఆమెను హత్య చేసి పరారయ్యాడా.. లేక ఇంకేమైనా జరిగిందా అనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ఉన్నతినిచ్చి.. సంతోషం పంచి

- టీడీపీ హయాంలో పదోన్నతులకు పాతర
- జెడ్పీ ఉద్యోగుల హక్కులు కాలరాసిన చంద్రబాబు
- సీఎంగా జగన్ బాధ్యతలు చేపట్టాక చకచకా ప్రక్రియ
- ఇప్పటికే 42 మందికి ప్రమోషన్లు
- త్వరలో మరో 46 మంది ఆఫీస్ సబార్డినేట్లకు పదోన్నతులు

టీడీపీ పాలనలో ఉద్యోగులకు పదోన్నతులు కల్పించకుండా వారి హక్కులను కాలరాశారు. ఫలితంగా వారంతా విసుగెత్తి పోయారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారు. ఉద్యోగులు తనపై ఉంచిన నమ్మకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వమ్ము చేయలేదు. పదోన్నతులకు శ్రీకారం చుట్టి ఎన్నో ఏళ్ల కలను సాకారం చేశారు.



జిల్లా పరిషత్ కార్యాలయం

అనంతపురం సిటీ: ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న సీఎం జగన్ ఇంకో వైపు ఉద్యోగుల సంక్షేమానికీ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జెడ్పీ పరిధిలో పని చేసే ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి సంతోషం పంచారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక 2021 సెప్టెంబర్ 25న కొత్తగా జెడ్పీ కార్యవర్గం కొలువుదీరింది. అప్పటి నుంచి ఉద్యోగుల పదోన్నతులు, కారుణ్య నియామకాలు, బదిలీలను పారదర్శకంగా చేపట్టారు. ముఖ్యంగా ఏళ్ల తరబడి పదోన్నతులకు నోచుకోని ఉద్యోగులకు పెద్దపీట వేశారు. వారికి ముందుగా ప్రమోషన్లు కల్పించేందుకు ప్రాధాన్యతనిచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 42 మందికి పదోన్నతులు కల్పించారు. జూనియర్ అసిస్టెంట్ల నుంచి సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి పొందిన వారు 26 మంది ఉండగా, సీనియర్ అసిస్టెంట్ కేడర్ నుంచి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు (ఏఓలు)గా పదోన్నతి లభించిన వారు 12 మంది ఉన్నారు. అలాగే, ఒక సీనియర్ అసిస్టెంట్‌కు ఈఓపీఆర్‌డీగా, ఇద్దరు రికార్డు అసిస్టెంట్లకు జూనియర్ అసిస్టెంట్లుగా, కార్యాలయ సబార్డినేట్ ఒకరికి డ్రైవర్‌గా ఉద్యోగోన్నతి కల్పించారు.

55 మందిపై కారుణ్యం..

కారుణ్య నియామకాలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగుల్లో కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశాలు కల్పించింది. ఒకేసారి 55 మందికి వారి విద్యార్హతలు, అవకాశాలను బట్టి కొలువులు చూపి రికార్డు సృష్టించింది. 15 మందిని జూనియర్ అసిస్టెంట్లుగా, ఇద్దరికి టైపిస్టులుగా, 38 మందిని ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించి కొండంత అండగా నిలిచింది.

త్వరలో అటెండర్లకూ..

జెడ్పీ, మండల పరిషత్ కార్యాలయాల్లో పని చేసే అటెండర్లు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాల సబార్డినేట్ల పదోన్నతి కల కూడా సాకారమయ్యే క్షణం వచ్చింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒకేసారి 46 మంది అటెండర్లకు రికార్డు, ల్యాబ్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించనున్నారు. ఇందుకు సంబంధించిన నివేదిక సిద్ధం చేశారు. మరో 3 లేదా 4 రోజుల్లోనే పదోన్నతులకు సంబంధించిన పత్రాలు అందించనున్నట్లు తెలిసింది. అంతే కాకుండా ఉద్యోగులు కోరుకున్న చోటుకు బదిలీ చేసేందుకు కూడా చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

సీఎం ఆశయాలకనుగుణంగా చర్యలు



ఉద్యోగుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారు. 25 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎంపీడీఓలకు డీఎల్‌డీఓలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. జగనన్న ఆశయాలకనుగుణంగా ఉమ్మడి జిల్లాలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాల్లో పని చేస్తున్న 46 మంది సబార్డినేట్లకు రికార్డ్, ల్యాబ్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తున్నాం. త్వరలో ఉత్తర్వులు విడుదలవుతాయి.

– బోయ గిరిజమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన 150 బస్తాల రేషన్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాలు.. గ్రామాల్లో రేషన్ దుకాణాల నుంచి కార్డుదారులు తెచ్చుకున్న బియ్యంను కిలో రూ.20 చొప్పున కొనుగోలు చేసి 150 బస్తాలలో నింపి తొండపాడు గ్రామంలో ఓ ఇంట్లో ఉంచారు. పక్కా సమాచారంతో సీఐ వెంకట్రామిరెడ్డి, సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. గ్రామంలోని రహస్య ప్రదేశంలో బియ్యం నిల్వ ఉంచినట్లు గుర్తించారు. 150 బస్తాలను స్వాధీనం చేసుకొని గుత్తి ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌కు తరలించారు. బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్న మండలంలోని కరిడికొండ గ్రామానికి చెందిన శంకర్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన వారిపై రెవెన్యూ చట్టం ప్రకారం 6ఏ, క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని సీఐ పేర్కొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. కూలీలకు గాయాలు



చికిత్స పొందుతున్న కాడమ్మ, శివమ్మ

బొమ్మనహాళ్: దర్గాహొన్నూరు గ్రామ శివారులో ఉన్న హెచ్చెల్సీ వంతెన పక్కన ట్రాక్టర్ బోల్తా పడి వ్యవసాయ కూలీలు గాయపడ్డారు. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గుండప్ప పొలంలో మిరప పంట కోత కోసం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు మల్లెక్క, శృతి, శశికళ, గంగమ్మ, హెచ్. హనుమక్క, వండ్రమ్మ, కాడమ్మ, శివమ్మలతో పాటు మరో 10 మంది అదే గ్రామానికి చెందిన ఈశ్వరప్ప ట్రాక్టర్‌పై బయలుదేరారు. హెచ్చెల్సీపై ఉన్న వంతెన కూలడంతో కాలువలోనే మార్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ట్రాక్టర్ కాలువ గట్టు ఎక్కుతున్న సమయంలో గేర్లు న్యూట్రలై వెనక్కు వస్తూ ట్రాలీ బోల్తా పడింది. ఘటనలో కూలీలు కాడమ్మ, శివమ్మ, వండ్రమ్మకు తీవ్ర గాయాలు కావడంతో బళ్లారి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మరికొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అక్కడే ఒక్క ఆర్‌ఎంపీతో ప్రథమ చికిత్స పొందారు. ప్రాణపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్

- నాడు కొండ గుట్టల ప్రాంతం.. నేడు పుణ్యక్షేత్రం
- భారతదేశంలోనే ఏకైక ఆలయం
- రేపటి నుంచి జయంత్యుత్సవాలు





సంత్ సేవాలాల్ మహరాజ్ మూలవిరాట్, సేవాలాల్ మహరాజ్ ఆలయం



భీమానాయక్ కట్ట

గుత్తి రూరల్: చెర్లోపల్లి గ్రామ పంచాయతీలోని సేవాగఢ్‌లో కొలువైన సంత్ సేవాలాల్ మహరాజ్ దేశవ్యాప్తంగా ఉన్న బంజారాల ఆరాధ్యదైవంగా పూజలందుకుంటున్నారు. సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ సేవాగఢ్‌లో 285 ఏళ్ల క్రితం జన్మించినట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో ఈ నెల 13 నుంచి ఈ నెల 15 వరకూ ఘనంగా జయంత్యుత్సవాలు జరగనున్నాయి. 14న రాత్రి జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. సేవాగఢ్‌కు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వేలసంఖ్యలో తరలివస్తుంటారు.

సేవాగఢ్ విశిష్టత..

గుత్తి మండలం చెర్లోపల్లి గ్రామ సమీపంలో సేవాలాల్ మహరాజ్ జన్మించినట్లు చెబుతారు. 25 సంవత్సరాల క్రితం వరకూ ఈ స్థలం నిర్జీవమైన కొండ గుట్టల ప్రాంతం. పెద్ద బండరాళ్లతో నిండిన అడవిలాంటి ప్రదేశం. నేడు ఒక పవిత్రస్థలంగా మారింది. గుత్తికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న చెర్లోపల్లి వద్ద రాంజినాయక్ తండాలో గిరిజనులుండేవారు. వారు ప్రసాదానికి అవసరమైన పాడిని అందించేవారని, అ తండా పెద్ద దిక్కుగా సేవాలాల్ తండ్రి భీమానాయక్ ఉండేవారు. భీమానాయక్‌కు ధర్మణీబాయితో వివాహమై 12 సంవత్సరాల తరువాత 1739 ఫిబ్రవరి 15న మొదటి సంతానంగా సేవాలాల్‌భాయ్ రాంజినాయక్ తండాలో జన్మించారు. తండ్రి భీమానాయక్ ఆ తండాకు పెద్ద దిక్కుగా ఉంటూ గిరిజనుల సమస్యలను పరిష్కరించడానికి నడుం బిగించారు. గ్రామంలో రచ్చబండపై పంచాయితీలు నిర్వహించి తీర్పులు చెప్పేవారని చరిత్ర ద్వారా తెలుస్తోంది. అ కట్టనే నేడు భీమానాయక్ కట్టగా పిలవబడుతోంది. ఆ కట్టకు ఎదురుగా ఉన్న బావిలో అక్కమ్మ గార్ల స్నానం చేయడంతో బావిని పవిత్ర ''కాళోకుండ్''గా పిలుస్తున్నారు. ఈ కాళోకుండ్ దగ్గరలో దండం మోరో మాత (మారెమ్మ దేవత) గుడి ఉంది. కాలక్రమంలో పెరిగి పెద్దవాడైన సేవాలాల్ భాయ్ దేశ సంచారం చేసి వెళ్లిన ప్రతి చోట అనేక మహిమలు చూపి ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేవారు. ఆలయం సమీపంలో గల కాళోకుండ్ బావిలో సేవాలాల్ మహరాజ్ అప్పట్లో పుణ్యస్నానం ఆచరించినట్లు బంజారాల విశ్వాసం. అక్కడ స్నానం చేసిన అనంతరం భీమానాయక్ కట్టపై ఆశీనులైన సేవాలాల్ తన బోధనలు చేసినట్లు వారి నమ్మకం. వాటి ఆధారంగా సేవాగఢ్‌లో రూ.కోటి వ్యయంతో అక్కడ ఆలయాన్ని నిర్మించారు. 2000 సంవత్సరంలో మొదటిసారిగా సేవాలాల్ జయంతి వేడుకలు నిర్వహించారు. అప్పటి నుంచి ఏటా ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలకు రాష్ట్రం నుంచే కాక దేశంలోని తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు, గిరిజన ముఖ్యనాయకులు పాల్గొంటారు.

మందిరం ఏర్పాటుకు రంజిత్‌నాయక్ కృషి..

చరిత్ర ఆధారాలతో సేవాగఢ్‌లో సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి బంజారానాయకుడు రంజిత్‌నాయక్ విశేష కృషి చేశారు. ఇక్కడ గుడి నిర్మాణానికి బంజారాలను ఏకం చేసి విరాళాలు సేకరించారు. రంజిత్‌నాయక్ కృషి తోనే నేడు సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సంత్ సేవాలాల్ మహరాజ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడిగా ఆయన ఆలయాన్ని అభివృద్ధి చేశారు. సేవాగఢ్‌లోని సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయ పరిసరాల్లో రూ.1.2 కోట్లతో మారెమ్మ(మాతా జగదాంబ) ఆలయాన్ని నిర్మించారు. ఇవేకాక ఆలయ అభివృద్ధికి ట్రస్ట్ సభ్యులు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఇలా చేరుకోవచ్చు..

సేవాగఢ్‌కు గుత్తి బస్టాండ్ నుంచి నేరుగా బస్సులు ఏర్పాటు చేశారు. రైలులో గుత్తి, గుంతకల్లు స్టేషన్లకు వచ్చిన భక్తులు ఆటోల ద్వారా బస్టాండులకు చేరుకొని ఆర్టీసీ బస్సుల్లో రావాల్సి ఉంటుంది. సొంత వాహనాల్లో వచ్చే వారు గుత్తి–గుంతకల్లు 67వ జాతీయ రహదారిలో గొల్లలదొడ్డి క్రాస్ నుంచి లోపలకు మూడు కిలోమీటర్ల వెళ్తే సేవాలాల్ ఆలయం వస్తుంది.

పుణ్యక్షేత్రానికి వెళ్తే.. ఇంటికి కన్నమేశారు!

- తాళం వేసిన ఇంట్లో చోరీ
- రూ. 20 వేల నగదు, 5 తులాల బంగారు ఆభరణాలతో పాటు వెండి ఆభరణాల అపహరణ



బీరువాలోని దుస్తులు పడేసిన దృశ్యం

గుత్తి: ఇంటికి తాళం వేసి పుణ్యక్షేత్రానికి వెళ్తే ఆ ఇంటిలో దొంగలుపడి దోచుకెళ్లారు. పట్టణంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వివరాలు. ఇండస్ట్రియల్ ఏరియాలో ఉంటున్న విక్రమ్ ఓ ప్రైవేట్ పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసేవాడు. మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి షిరిడీకి వెళ్లాడు. ఆదివారం తిరిగి ఇంటికొచ్చాడు. ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా బీరువాలో దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాను పరిశీలించగా అందులో ఉన్న రూ. 20 వేల నగదు, 5 తులాల బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు కనిపించలేదు. వెంటనే అతడు పోలీసులకు సమచారాం ఇచ్చారు. సీఐ వెంకటరామిరెడ్డి పోలీసులతో కలిసి విక్రమ్ ఇంటిని పరిశీలించారు. సీసీ కెమెరాను పరిశీలించారు. ఇద్దరు దుండగులు ఇంటిలోకి చొరబడి చోరీ చేసినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయింది. అనంతపురం క్లూస్ టీం సభ్యులు చోరీ జరిగి ఇంటిలో వేలిముద్రలు సేకరించారు. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఏటీఎంల్లో చోరీకి విఫలయత్నం

తాడిపత్రి అర్బన్: పట్టణంలో రెండు ఏటీఎంల్లో నగదు చోరీకి విఫలయత్నం జరిగింది. అర్బన్ ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు.. పట్టణంలోని యల్లనూరు రోడ్డులోని బ్యాంక్ ఆఫ్ బరోడా, సంజీవనగర్ 1వ రోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎంలను శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి నగదును చోరీ చేసేందుకు ప్రయత్నించారు. అయితే ఏటీఎంలు ఎంతసేపటికీ తెరుచుకోకపోవడంతో చేసేదేమి లేక వెనుదిరిగారు. బ్యాంకు అధికారులు ఆదివారం ఉదయం విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి

ఉరవకొండ: మండలంలోని బూదగవిలో కుక్కల దాడి చేసిన ఘటనలో గొర్రె పిల్లలు మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ధనుంజయ ఆదివారం ఉదయం గొర్రె పిల్లలను పాకలో ఉంచి గొర్రెలను మేతకు తోలుకెళ్లాడు. కుక్కల గుంపు పాకలో ఉన్న గొర్రె పిల్లలపై దాడి చేసింది. ఘటనలో 10 గొర్రెపిల్లలు మృతి చెందాయి. ఘటనలో రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.



మృతి చెందిన గొర్రె పిల్లలు

సీఎం జగన్‌తోనే బడుగుల అభ్యున్నతి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసంహయ్య



మాట్లాడుతున్న పైలా నరసంహయ్య

కళ్యాణదుర్గం: దేశ లోనే ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంస్కరణలతో బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసంహయ్య అన్నారు. ఆదివారం పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో బీసీ సామాజిక వర్గాలు అన్నీ ఏకం కావాలన్నారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను సాధికారత వైపు సీఎం వైఎస్ జగన్ నడిపించారన్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, మార్కెట్ యార్డు, మున్సిపల్ చైర్మన్లు, ఎమ్మెల్యే, ఎంపీలుగా రాజకీయంగా అవకాశాలు కల్పించి కొత్త అధ్యయానికి తెర లేపారన్నారు. రాజ్యసభలోనూ బడుగు వర్గాలకు అవకాశం కల్పించారని గుర్తు చేశారు. దళిత సామాజిక వర్గానికి చెందిన గొల్ల బాబురావుకు రాజ్యసభలో అడుగుపెట్టే అవకాశం కల్పించడం సీఎం గొప్పతనానికి నిదర్శనమన్నారు. టీడీపీ హయాంలో బడుగు బలహీన వర్గాలను రాజ్యసభకు పంపిన ఇచ్చిన దాఖలాలు లేవని చెప్పారు. రజకులు, నాయీ బ్రాహ్మణులను మోసం చేస్తే జగనన్న చేదోడుతో ఆదుకుంటున్నారన్నారు. ప్రముఖ ఆలయాల్లో కమిటీ సభ్యులుగా రజకులు, నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించారని గుర్తు చేశారు. చంద్రబాబుకు బీసీలు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తుకు వస్తారని విమర్శించారు. చంద్రబాబు 600 హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేస్తే, సీఎం వైఎస్ జగన్ మేనిఫెస్టోలో పొందుపరిచిన 99 శాతం హామీలను అమలు చేసి కొత్త చరిత్రను సృష్టించారన్నారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అంతకుముందు యాదవ కులస్తులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మెన్ రామ్మోహన్, కంబదూరు మండల పార్టీ కన్వీనర్ బాలరాజు, నాయకులు చంద్రశేఖర్ యాదవ్, ఎర్రిస్వామి, కిరీటి, అక్కమాంబ ఆలయ కమిటీ చైర్మెన్ రాము, సంజీవ్ యాదవ్, హనుమంతరాయుడు, యాదవులు పాల్గొన్నారు.

అలరించిన 'సాయి అనుగ్రహం'



నృత్యరూపకంలోని ఒక ఘట్టం

ప్రశాంతి నిలయం: సత్యసాయి దివ్య బోధనలు మానవాళిని సన్మార్గంలో నడుపుతున్న తీరును వివరిస్తూ సాగిన 'సాయి అనుగ్రహం' నృత్యరూపకం భక్తులను అలరించింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా సత్యసాయి భక్తులు ఆదివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత 'సాయి అనుగ్రహం' పేరుతో సంగీనృత్య రూపకం ప్రదర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు సత్యసాయి బోధనలు ఆచరించడం ద్వారా ఏ విధంగా పరిష్కారం అవుతున్నాయో.. మనుషుల మధ్య తారతమ్యాలు, భేదాభిప్రాయాలు తొలగుతున్న తీరును చక్కగా వివరించారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం: అనారోగ్యంతో మృతి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌కు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా ఏఆర్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రాజశేఖర్(55) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య రాధ, కుమారుడు సాయి పవన్, కుమార్తె కీర్తన ఉన్నారు. ఈయన 1992లో ఏపీఎస్పీ విభాగంలో కానిస్టేబుల్‌గా చేరాడు. 2005లో ఏఆర్ విభాగానికి కన్వర్షన్ అయి జిల్లా ఏఆర్ విభాగంలో పని చేస్తున్నాడు. స్థానిక నందమూరినగర్‌లో రాజశేఖర్ మృతదేహాన్ని ఏఆర్ డీఎస్పీ మునిరాజా, ఆర్ఐలు హరికృష్ణ, రాముడు సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు స్థానిక పిల్లిగుండ్ల క్వార్టర్స్ సమీపంలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాల







అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మూలవిరాట్, దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు, ఆలయ పరిసరాల్లో వెలసిన గాజులు, బొమ్మల అంగళ్లు

గార్లదిన్నె: గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాలలో భాగంగా మొదటి ఆదివారం ఆలయంలో సందడి నెలకొంది. ఆలయ ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామికి ఏకవార రుద్రాభిషేకం, సహస్రనామార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచేగాక జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న 108 సాల గ్రామ శివలింగాలకు పూజలు నిర్వహించారు. ఇలా చేయడం వల్ల కోర్కెలు తీరుతాయని ప్రజల నమ్మకం. సంతానం లేని మహిళలు ఆలయం వద్ద ఉన్న పుట్ట చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మూలవిరాట్ అడుగున ఉన్న నీటిని భక్తులు బాటిళ్లలో తీసుకెళ్లారు. ఈ నీటిని సేవిస్తే సకల రోగాలు నివారణ అయితాయని, పొలంలో చల్లితే పంటలు సమృద్ధిగా పండుతాయని ప్రజల ప్రగాఢ విశ్వాసం.

భక్తులతో కిటకిటలాడిఆలయ ప్రాంగణం..

తిరుణాల సందర్భంగా భక్తులు అధికంగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సుబ్బిరెడ్డి, ఆలయ ఈఓ బాబు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా గాజుల అంగళ్లు, తినుబండారాలు, చెరకు, బొరుగుల అంగళ్లు ఏర్పాటు చేశారు. ఆయా అంగళ్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం అనంతపురం నుంచి దేవస్థానం వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది.

జనవాక్కు

అంతా మంచే జరిగింది



సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సచివాలయాల ద్వారా అంతా మంచే జరుగుతోంది. గతంలో ప్రతి చిన్న పనికీ మండల కేంద్రానికి వెళ్లేవాళ్లం. ఇప్పుడు అన్నీ పనులూ మా ఊళ్లోనే చక్కబెట్టుకుంటున్నాం. నా కుటుంబానికి అమ్మ ఒడి, విద్యాదీవెన, రైతు భరోసా, చేయూత, పింఛన్ తదితర పథకాల కింద దాదాపు రూ.1.20 లక్షల లబ్ధి చేకూరింది. అన్ని వర్గాలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నా.

– ఓబుళయ్య, ఎల్లుట్ల, పుట్లూరు మండలం

సొంతింటి కల నెరవేరింది



లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ నా భర్త సంపాదనపై జీవిస్తున్న మాకు కనీసం ఇంటి స్థలం లేక అద్దె ఇంట్లోనే నెటుకొచ్చేవాళ్లం. ఇంటి బాడుగ, కరెంట్ బిల్లు కట్టేందుకు నా భర్త సంపదన సరిపోక నానా ఇబ్బందులు పడ్డాం. సొంతిల్లు కావాలంటూ గత ప్రభుత్వం పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం దక్కలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మాకు ఇంటి స్థలం, పక్కా గృహ నిర్మాణం మంజూరయ్యాయి. ప్రస్తుతం కొత్తింట్లో ఎంతో సంతోషంగా జీవిస్తున్నాం. మా సొంతింటి కలను సాకారం చేసిన సీఎం వైఎస్ జగనన్నకు మేమెంతో రుణపడ్డాం. ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాం.

– అనిత, గార్లదిన్నె

బడులను బాగుచేశారు



పేద పిల్లలు చదివే ప్రభుత్వ బడుల రూపురేఖలను మార్చిన ఘనత జగనన్నకే దక్కుతుంది. నా పిల్లలు పుట్లూరు ఆదర్శ పాఠశాలలో చదువుతున్నారు. వారికి పుస్తకాలు, బ్యాగ్‌లు ఇవ్వడంతో పాటు మారిన కాలన్ని బట్టి ట్యాబ్‌ల ద్వారా మంచి విద్య అందిస్తున్నారు. పిల్లల చదువుకంటే పెద్ద ఆస్తి ఏముంటుంది? విద్యా వ్యవస్థలో పేదల పిల్లల కోసం ఆయన చేస్తున్న కృషిని జీవితంలో మరువలేం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటాం.

– రామాంజులరెడ్డి, పి.చింతలపల్లి, పుట్లూరు మండలం

పేకాటరాయుళ్ల అరెస్టు

పెద్దపప్పూరు: చింతరపల్లి సమీపంలోని ఓ మామిడితోటలో పేకాట ఆడుతున్న 12 మందిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి పేకముక్కలతో పాటు రూ. 1,04,040 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రోషన్, ఎస్ఐ శరత్‌చంద్ర తెలిపారు.

యాడికిలో..

యాడికి: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి కాలనీ సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురు పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.10,120 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా బుటారి నరసింహులు

- 10వ సారి జిల్లాకు అగ్రస్థానం



నరసింహులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన ప్రధానోపాధాయుడు బుటారి నరసింహులును ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో రాష్ట్ర కమిటీని ఎన్నిక జరిగింది. కార్యదర్శిగా 15 ఏళ్లలో పదోసారి జిల్లా వాసికి అవకాశం రావడం విశేషం. విద్యారంగ అభ్యున్నతి, ఉపాధ్యాయుల సేవలు, సంక్షేమానికి 30 ఏళ్లుగా పోరాటాలు చేస్తూ వివిధ హోదాలు, ఐక్య కార్యాచరణ ఉద్యమాల్లో నరసింహులు సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 60 వేల మందికి పైగా సభ్యత్వం ఉన్న ఏపీటీఎఫ్‌కు సేవలు అందించడం గర్వంగా ఉందన్నారు. మూడు దశాబ్దాలుగా విద్యాభివృద్ధి, ఉపాధ్యాయుల అభ్యున్నతికి పాటు పడుతున్నామన్నారు. గార్లదిన్నె మండలంలో పనిచేస్తున్న కె. సర్దార్ వలికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అవకాశం కల్పించారు. వీరి ఎన్నిక పట్ల జిల్లా శాఖ అధ్యక్షుడు రాయల్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, పూర్వ ప్రధాన కార్యదర్శి బి హనుమప్ప, ఉపాధ్యక్షులు బొమ్మయ్య, భాస్కర్ జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్ ,చెన్నకేశవులు, బాలా రామ మోహన్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ కోటిగారి వన్నప్ప తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

బాలికల హక్కులు పరిరక్షిద్దాం



చిన్నారులకు భోజనం వడ్డిస్తున్న వాసంతి సాహిత్య

అనంతపురం కల్చరల్: బాలికల హక్కులు పరిరక్షిద్దామని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య అన్నారు. స్థానిక లక్ష్మీనగర్‌లోని క్రీసెంట్ రెయిన్‌బో హోమ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలకు సౌకర్యాలను కల్పిస్తూ ఆత్మవిశ్వాసం నింపుతున్నారని సీఆర్‌డీఎస్ నిర్వాహకులు సద్దాం హుస్సేన్‌ను అభినందించారు. బాలికల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయని గుర్తు చేశారు. అనంతరం 100 మంది చిన్నారులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో రెయిన్‌బో హోమ్ మేనేజర్ శిల్ప, లక్ష్మీ కాంతమ్మ, మమత, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లిలో సోమవారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పర్యటించనున్నట్లు సర్పంచ్ లక్ష్మీనారాయణ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు శ్రీ కృష్ణ దేవాలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ ఉంటుందన్నారు. అనంతరం ఎస్సీ కాలనీలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ ఉంటుందని తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో మాఘమాస పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మాఘమాస పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలతో పాటు విశేష పూజలు నిర్వహించారు. బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించి పూజలు చేశారు. మహాగణపతి మోదుక హోమం చేపట్టారు. స్వామి వారి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షిణ చేయించారు. మంజునాథ స్వామి, పార్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.

బైకు అదుపుతప్పి ఇద్దరికి గాయాలు





గాయపడ్డ లక్ష్మీదేవి, హనుమంతు నాయక్

ఆత్మకూరు: ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో ఇద్దరు గాయపడ్డారు. గొరిదిండ్ల తండాకు చెందిన మాజీ ఎంపీపీ హనుమంతు నాయక్ తన భార్య లక్ష్మీదేవితో కలిసి ఆదివారం అనంతపురం నుంచి గ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తుండగా ఆత్మకూరు వద్ద అదుపు తప్పి కిందపడ్డారు. లక్ష్మీదేవికి కాలు విరిగింది. తలకు గాయాలు అయ్యాయి. హనుమంతు నాయక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. 108 వాహనంలో వీరిని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పూర్వవిద్యార్థుల ఆర్థిక సాయం



అలివేలమ్మకు ఆర్థికసాయం చేస్తున్న స్నేహితులు

ఆత్మకూరు: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు తనతో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో 1987–88 విద్యా సంవత్సరంలో అలివేలమ్మ పదో తరగతి చదువుకుంది. కూడేరు మండలం నారాయణపురంలో నివాసముంటున్న ఆమె పక్షవాతం బారినపడి మంచానికి పరిమితమైంది. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు (పదో తరగతి కలిసి చదువుకున్న వారు) తమవంతుగా రూ.15వేల నగదు పోగు చేసి ఆదివారం నారాయణపురం వెళ్లి అందజేశారు. ధైర్యంగా ఉండాలని అలివేలమ్మకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో వెంకటేష్, అతిక్‌రెడ్డి, వెంకటేష్, సతీష్, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అశ్వత్థం తిరునాల



పూజలందుకుంటున్న ఉత్సవమూర్తులు



పెన్నానదిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

- పోటెత్తిన భక్తులు
- పెన్నానదిలో పుణ్య స్నానాలు

పెద్దపప్పూరు: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన అశ్వత్థ నారాయణస్వామి మొదటి ఆదివారం తిరునాల సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి స్వామి దర్శనం కోసం వందలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులు ఉత్తర, దక్షిణ ముఖంగా ప్రవహిస్తున్న పవిత్ర పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించి నారాయణ స్వామి చక్రభీమలింగేశ్వరుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కోర్కెలు నెరవేరిన భక్తులు కానుకలు, ముడుపులు, బియ్యం, బేడలు, తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తిరుణాల సందర్భంగా క్షేత్రంలో చెరుకు గడల అమ్మకాలతో పాటు నోరూరించే తినుబండారాలు, గాజుల అంగళ్లు, ఆట వస్తువుల దుకాణాలు వెలిశాయి. భక్తులు ఇబ్బంది పడకుండా పెద్దవడుగూరు సీఐ రోషన్, పెద్దపప్పూరు ఎస్ఐ శరత్ పటిష్ట చర్యలు చేపట్టారు. నదిలోతట్టు ప్రాంతాల్లోకి వికలాంగులు, వృద్ధులు, చిన్నారులు వెళ్లకుండా ఆలయ పాలక మండలి చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాస రెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం తగు చర్యలు చేపట్టారు. గత మూడేళ్లలో తొలి ఆదివారం తిరునాలకు ఊహించని రీతిలో భక్తులు తరలిరావడం ఇదే ప్రథమమని దేవదాయ శాఖ అధికారులు తెలిపారు. భక్తుల కోసం వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపారు. చిన్నపప్పూరు బస్టాండ్ వద్ద తాడిపత్రి పట్టణానికి చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం సభ్యులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చేసిన భక్తులకు మొక్కుబడిలో భాగంగా పలు ప్రదేశాల్లో దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు.

వాసవీమాతా.. నమోస్తుతే



వజ్రాల చీరతో వాసవీమాతను అలంకరించిన దృశ్యం



గోత్రాలతో ముగ్గు ఇలా..

అనంతపురం కల్చరల్: ఆర్యవైశ్యుల ఆరాధ్యదేవత వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉదయం స్థానిక కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ హోమం, మధ్యాహ్నం పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా మండలి వారు ఏర్పాటు చేసిన వాసవీమాత విశ్వరూప దర్శనం, అగ్నిగుండ ప్రవేశం, 102 గోత్రాల రుషుల చిత్రాలతో వేసిన ముగ్గు ఆకట్టుకుంది. అనంతరం ఆలయంలో వజ్రాల చీర అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

ఆకట్టుకున్న ఆపాత మధురాలు



పాటలు పాడుతున్న పాలసముద్రం నాగరాజు తదితరులు

అనంతపురం కల్చరల్: అమరగాయకుడు ఘంటసాల ఆలపించిన ఆపాత మధురాలతో గాయనీ గాయకులు శ్రోతలను మంత్ర ముగ్ధులను చేశారు. అనంత ఘంటసాల ఆరాధన సమితి వ్యవస్థాపకులు, సీనియర్ గాయకులు పాలసముద్రం నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం 3వ రోడ్డులోని ఘంటసాల భవన్‌లో సంగీత కచేరీ నిర్వహించారు. యశోద, లక్ష్మీనారాయణ, పద్మ, యాదాటి రవి, లక్ష్మి, జానకి తదితరులు ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. పాలసముద్రం నాగరాజును సత్కరించారు. ఔత్సాహికులైన గాయకులను ప్రోత్సహించడం, కళాభిమానులకు ఉచిత భోజన వసతి కల్పించడం గర్వకారణమన్నారు.

- ఘంటసాల సంగీత కళాభారతి అధ్యక్షుడు సుగుమంచి సురేష్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక ఆఫీసర్స్ క్లబ్‌లో సంగీత విభావరి ఘనంగా జరిగింది. కాకినాడకు చెందిన కళాకారుడు పీవీ రమణకు ఘంటసాల స్మారక అవార్డునందించారు.

• బాలోత్సవానికి సర్వం సిద్ధం



అనంత బాలోత్సవం టైమ్ టేబుల్ పోస్టరును పరిశీలిస్తున్న నిర్వాహకులు

చిన్నారుల సృజనను చాటే 'బాలోత్సవం' ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ఉదయం బాలోత్సవం ప్రారంభం కానుంది. ఉత్సవ వేదికను ఆదివారం సాయంత్రం కమిటీ అధ్యక్షురాలు షమీహా షఫీవుల్లా, కమిటీ సభ్యులు సావిత్రి, జిలాన్ పరిశీలించారు. కల్చరల్, అకడమిక్, స్పోర్ట్స్ విభాగాలలో కార్యక్రమాలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చిన్నారులను ప్రోత్సహించి.. మూడు రోజుల పాటు ఉత్సవం విజయవంతంగా సాగేలా సహకరించాలని కోరారు. – సాక్షి ఫొటోగ్రాఫర్

ఘంటసాల గానం అజరామరం



విజయదుర్గను సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: ఘంటసాల గానం అజరామరమని ప్రముఖ వ్యాఖ్యాత విజయదుర్గ అన్నారు. పాపాప్రే (పాత పాటల ప్రేమికుల సమూహం) ప్రతినిధులు ఓబుళదాసు, జి.వెంకటరామయ్య నేతృత్వంలో 3 రోజులుగా సాగిన కళాయాత్ర ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక హౌసింగుబోర్డులోని ఘంటసాల స్మారక మందిరం వద్ద సమావేశం నిర్వహించారు. దూరదర్శన్ తొలి వ్యాఖ్యాత విజయదుర్గ ఆత్మీయ అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పాత పాటల ప్రచారానికి 'పాపాప్రే' చేస్తున్న కృషితో రెండు తెలుగు రాష్ట్రాల్లో కళాభిమానులకు వీనులవిందైన సంగీత మందుతోందన్నారు. వివిధ జిల్లాల సంస్కృతి సంప్రదాయాలు పంచుకుంటూ సాగిస్తున్న కళాయాత్రలు వినూత్నంగా ఉన్నాయని అభినందించారు. ఎన్టీఆర్, వైఎస్సార్, ఏఎన్నార్ వంటి వారి విస్తృత ఆలోచనలను తెలుగు వారితో పంచుకునే అదృష్టం రావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆమెను పలువురు కళాకారులు ఘనంగా సత్కరించారు. విగ్రహం వద్ద ఉదయం, సాయంత్రం వేర్వేరుగా సంగీత విభావరి వీనుల విందుగా జరిగింది. కళాభిమానులు ఓబుళదాసు, ఘంటసాల రామయ్య, శ్రీనివాసరావు, రామమోహనరెడ్డి, శాంతి శ్రీమణి, దుర్గాప్రసాద్, సత్యనారాయణమూర్తి, శ్రీదేవి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్



ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

అనంతపురం కార్పొరేషన్: 'నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు' పథకం కింద ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నగరంలో వేగవంతంగా కొనసాగుతోంది. సెలవు దినం ఆదివారం కూడా నగరంలోని 74 సచివాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్ చేపట్టారు. సచివాలయ అడ్మిన్లు, వీఆర్‌ఓలు లబ్ధిదారులను సచివాలయాలకు పిలిపించి పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించారు. సుమారు 200 రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు.

రిజిస్ట్రేషన్ పక్కాగా చేపట్టాలి

రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎటువంటి తప్పులు లేకుండా పక్కాగా నిర్వహించాలని నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా నగరపాలక సంస్థ అధికారులు, స్పెషలాఫీసర్లు, నోడల్ అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. సర్వే నెంబర్లు, డోర్ నెంబర్లు తదితర వాటిని పక్కాగా నమోదు చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం కనిపించకూడదన్నారు.

'సిద్ధం' సభను విజయవంతం చేయాలి



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపు

రాప్తాడు: సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు ఈ నెల 18న రాప్తాడు ఆటో నగర్ సమీపాన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే రాయలసీమ స్థాయి 'సిద్ధం' సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన బహిరంగ సభ స్థలం చదును, టెంట్లు, పార్కింగ్, హెలిప్యాడ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పారదర్శక పాలనతో అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందించి మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేరుగా ఎదుర్కోలేక టీడీపీ, జనసేన కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాల మైండ్ గేమ్‌లో భాగంగా ప్రభుత్వంపై పచ్చ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారన్నారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా విద్య, వైద్యం, ఇళ్ల స్థలాల పంపిణీ, పెన్షన్లు దేశానికే తలమానికంగా నిలుస్తున్నాయన్నారు. రూ.3.50 లక్షల కోట్ల నగదును వివిధ పథకాల రూపంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు కుల, మత వర్గాల, ప్రాంతాలకు అతీతంగా సీఎం జగన్ నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. పాదయాత్ర–ఎన్నికల మేనిఫెస్టో హామీలను సంపూర్ణంగా అమలు చేసిన జగన్‌ను మళ్లీ సీఎం చేసుకునేందుకు 175 అసెంబ్లీ స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయానికి శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, అనంతపురం జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, మండల ఎన్నికల ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది, నాయకులు బాల నాగిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మన్నల రవి కుమార్, సింగారప్ప, మాచిరెడ్డి చెన్నారెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు అర్చక సమాఖ్య సమావేశం

అనంతపురం కల్చరల్: ఏపీ అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో అర్చకుల సమావేశం మంగళవారం జరుగనుందని సమాఖ్య అధ్యక్షులు పూజారి భీమప్ప ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో నిర్వహించనున్న సమావేశంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన పలువురు అర్చకులు పాల్గొంటారన్నారు. ప్రజా ప్రతినిధులకు, అధికారులకు తమ సమస్యలను విన్నవించనున్నట్లు పేర్కొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 'కార్డెన్ సెర్చ్'



వాహనాలను తనిఖీ చేస్తున్న దృశ్యం

అనంతపురం: ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ చేపట్టారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్లు, కర్ణాటక మద్యం, నాటు సారా, గుట్కా విక్రేతలు, అనుమానితులు, పాత కేసుల్లోని నిందితుల ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. గ్రామాల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. గ్రామసభలు నిర్వహించి ప్రశాంతంగా జీవించాలని సూచించారు. అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాల తనిఖీలు చేపట్టి రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు.

ఆహ్వానం



పాదయాత్రకు మేయర్‌ను ఆహ్వానిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కావాలని ఆకాంక్షిస్తూ ఉరవకొండలోని జైనబ్బి దర్గా నుంచి దర్గా హోన్నూరు శర్మాస్ వలి దర్గా వరకూ ఈనెల 15న ముస్లింలు పాదయాత్ర నిర్వహించనున్నారు. నగర మేయర్ వసీం సలీంకు ఆదివారం ముస్లిం మైనార్టీ నాయకులు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ పామిడి జాకీర్, జిల్లా యువజన విభాగం కార్యదర్శి వడ్ల సలీం, సాంస్కృతిక విభాగం జిల్లా కార్యదర్శి దాదు, టౌన్ మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ జిలాన్, దూదేకుల శర్మాస్, షాకీర్, శర్మాస్ వలి పాల్గొన్నారు.

16న మహంకాళి విగ్రహ ప్రతిష్ట

బుక్కరాయసముద్రం: మండలంలోని జంతలూరు గ్రామంలో ఈ నెల 16న మహంకాళీ దేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. ఈ నెల 15న ఆలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహ వచనం, కళశ స్థాపన, 16న ఉదయం 10.30 గంటలకు మహంకాళి విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

108 వాహనంలో ప్రసవం



ప్రసవం చేసిన ఈఎన్‌టీ రామతులసి

రాయదుర్గం: గుమ్మఘట్ట మండలం గొల్లపల్లికి చెందిన దుర్గ అనే గర్భిణి శుక్రవారం రాత్రి పురిటినొప్పులతో రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో చేరింది. గర్భిణికి హైరిస్క్ ఉండడంతో సిబ్బంది కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. 108 వాహనంలో అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకెళ్తుండగా, మార్గం మధ్యలో కాలువపల్లి వద్దకు చేరుకోగానే భరించలేని నొప్పులు వచ్చాయి. 108 వాహన ఈఎన్‌టీ రామతులసి, పైలెట్ ఉమేష్ సహకారంతో సుఖప్రసవమైంది. ఐదేళ్ల తర్వాత జన్మించిన బిడ్డను చూసి దుర్గ కుటుంబ సభ్యులు మురిసిపోయారు. సుఖ ప్రసవం చేసిన ఈఎన్‌టీ రామతులసికి కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు 'ఇంటింటికీ వైఎస్సార్ సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 41వ డివిజన్‌లో సోమవారం ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని హైదర్‌వలీ కాలనీ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

నేడు ప్రసన్నాయపల్లిలో 'వైఎస్సార్ ఆసరా' సంబరాలు

రాప్తాడు: ప్రసన్నాయపల్లి పంచాయతీలో సోమవారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పర్యటిస్తారని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 'వైఎస్సార్ ఆసరా' సంబరాలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరవుతారని పేర్కొన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు 'వైఎస్సార్ ఆసరా' చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని తెలిపారు. వలంటీర్లు, పార్టీ సచివాలయాల కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

సంతల ఆదాయం రూ.3.39 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.39 లక్షల ఆదాయం వచ్చినట్లు యార్డు చైర్మన్ ఏ.ఫయాజ్, సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1,75,300, ఆదివారం జరిగిన పశువుల సంత ద్వారా రూ.1,64,050 ఆదాయం వచ్చిందన్నారు.

నేడు స్పందన

అనంతపురం కార్పొరేషన్: నగర పాలక సంస్థలో సోమవారం ఉదయం 10.30 గంటలకు 'స్పందన' కార్యక్రమం జరగనుంది. నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఇతర సెక్షన్ అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. నగర ప్రజలు తమ సమస్యలపై వినతులు ఇవ్వాలని వారు సూచించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కనగానపల్లి: మండల కేంద్రం కనగానపల్లిలో ఆదివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పవన్ కుమార్ కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 12 ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలో అక్రమంగా మద్యం విక్రయించినా, పేకాట, మట్కా తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు.

నగరంలో..

అనంతపురం: కర్ణాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు టీవీ టవర్ సమీపంలోని ఎన్టీఆర్ కాలనీకి ఎందిన శికారి దశరథ (46)ను కర్ణాటక మద్యం అమ్ముతున్న సమయంలో అరెస్టు చేశామన్నారు. అతని వద్ద ఉన్న 35 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

14న అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

కనగానపల్లి: మామిళ్లపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈ నెల 14న అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కె. లోకనాథరెడ్డి తెలిపారు. ఆంజనేయస్వామి విగ్రహంతో పాటు ఆలయం ముందు నాగుల ప్రతిష్ట కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

భగవంతునిపై విశ్వాసం ఉంచాలి



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న అజ్గర్ హుస్సేని

అనంతపురం కల్చరల్: భగవంతునిపై అచంచల విశ్వాసం కలిగి ఉండాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మహ్మద్ అజ్గర్ హుస్సేని తెలిపారు. గుల్బార్గాలో వెలసిన హజరత్ ఖాజా బందే నవాజ్ వారసులు హజరత్ మహమద్ అజ్గర్ హుసేని నగరానికి వచ్చారు. వినాయక నగర్‌లో ప్రభుత్వ కాజీ బాహిద్ హుసేన్ ఆస్థానంలో ఆదివారం రాత్రి ఆయన ప్రసంగించారు. ఆత్మస్వరూపుడైన భగవంతుడు అందరిలో ఉన్నాడన్నారు. సాటి మనిషిలో దైవత్వాన్ని సందర్శించగలిగే స్థితికి చేరుకోవాలన్నారు. మానవత్వం, శాంతి, సత్యం ద్వారా మాత్రమే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. వందలాది మంది భక్తులు పాల్గొని అజ్గర్ హుసేని ధర్మబోధలను ఆలకించారు.